

# పెద్ద ఆకారాలూ చిన్న వికారాలూ

## భానుమతీ రామకృష్ణ

చిన్నప్పట్నుంచీ నాకు బల్లి అంటే చెప్పడానికి వీల్లేనంత భయం. దాని ఆకారంచూస్తే పరమ అసహ్యం. కొందరికి యిదే విధంగా కప్పన్నా, ఊడతన్నా, బొద్దింకెన్నా, తొండన్నా భయమూ—అసహ్యమూ కలగడం కద్దు....కాని ఒకరి భయాన్నీ, అసహ్యాన్నీ మరొకరు అర్థం చేసుకోడానికే ప్రయత్నించకపోగా విడ్డూరంగా చూస్తారు. కొందరికి బల్లి అంటే భయంలేదు గనక ఎదుటి వాళ్ళు బల్లిని చూసి భయపడుతున్నారని తెలిస్తే తాటాకులుకట్టి ఏడిపించి ఎగతాళి చేసి గోల చేస్తారు. యిందుకే పిల్లికి చెలగాటం ఎలక్కు ప్రాణ సంకటం అన్నారు...


ఈ ప్రాణసంకటంలో బాధపడే ఎలుకల్లో నేనొకదాన్ని.....బల్లి నాకు పరమ శత్రువు.....అది వుంటే గదిలో కాలు పెట్టను. ఒకవేళ అంతగా ఆ గదిలోకి వెళ్ళాల్సొస్తే పనివాళ్లను పిలిచి ఆ బల్లిని బయటికి తరిమించి అది వెళ్ళిపోయిందో లేదో జాగ్రత్తగా చూసి మరీ లోపలడుగు పెడతాను.....యింక విధిలేని సందర్భాల్లో, పులిబోనులో తల దూర్చినట్లు భయపడుతూ, లోపలికెళ్లి అది వున్న వేపు వెళ్లకుండా అది ఏవైపు తిరుగుతుంటుందో చూసుకుంటూ, అదీ నేనూ రాహుకేతువుల్లాగా ఎదురు బదురుగా తిరుగుతుంటాం..

ఎంత దూరంలో వున్నాసరే దాని కదలిక నా కండ్లు కట్టేస్తుంది....అది కాస్త జరిగితే నాకు తెలీకుండానే నా శరీరం ఆటోమేటిగ్గా యింకోవైపు జరుగుతుంది.....కాని యింత కాన్‌సన్‌ట్రేషన్ దానిమీద వుంచినా, నా అవస్థ ఎదుటి వాళ్ళు ఓపళంగా పసికట్టకుండా తంటాలు పడుతుంటాను.... ఎవరైనా కూర్చుని కబుర్లు చెప్పుకుంటూ వుండేప్పుడు, వాళ్ళ తలకు సరిగ్గా పైన ఏదంతి మీదనో బల్లి పాకడం నా కంట పడ్డదో (సాధారణంగా నాకంటే పడుతుంది....) యిహ ఆ బల్లి నా నెత్తికే సరిగా పాకుతున్నంత భయమూ కంపరమూ కలిగేది....ఏ క్షణంలో వాళ్ల నెత్తిమీద పడుతుందోనని తల్లడిల్లిపోయేదాన్ని....ఉండబట్టలేక నా భయాన్ని వాళ్లకు తెలీనివ్వకుండా వుండేందుకు పైకి ఆముదం తాగినట్లు నవ్వుతూ.... "మీ నెత్తికి సరిగ్గా బల్లి వుంది"...అనేదాన్ని.... నాలాగే ఎదుట వాళ్ళు కూడా చెంగున గంతేసి అవతలకు దూకుతారనే ఆశతో....అబ్బే....అలాంటిదేం జరక్కపోగా ఆ కూర్చున్న వాళ్ళు అరయించి కూడా జరక్కుండా తలపైకెత్తి సూటిగా బల్లిని చూస్తూ...."అదేం చేస్తుందండీ పాపం! అది మోస్ట్ హారమ్ లెస్ క్రీచర్" అనేవాళ్ళు అలక్ష్యంగా నవ్వుతూ. ఈమాటే చిన్నప్పుడు నే చదివిన గరల్స్ స్కూలు మేష్టరమ్మ కూడా అన్నది.

ఓసారి క్లాసులో ఝాన్సీ లక్ష్మీబాయి ధైర్య సాహసాలను వర్ణించి పాఠం చెబుతోంది మా మేష్టరమ్మ. 'సడన్'గా నా ముందున్న బల్లకింద బల్లి కదులుతున్నట్లు అనుమానం కలిగింది...నా గుండె గతుక్కుమంది. యింక అక్కడ ఒక్క క్షణం కూడా కూర్చోలేక ముళ్లమీదున్నట్లు బాధపడ్డాను. భయంతో వణుకుతున్న నేను మాష్టరమ్మ చూడకుండా పక్క పక్కలకు జరగడం నా వరసలో కూర్చున్న పిల్లలు పసికట్టేశారు.

"ఏమోయ్ బల్లేమైనా కనిపించిందా!" అని రహస్యంగా అడిగి మెల్లిగా నవ్వుకున్నారు. నేను కూర్చున్న వరసలో కలకలం బయల్దేరడం మేష్టరమ్మ కంటబడ్డది...."

"ఏమిటది! పాఠం వినకుండా 'న్యూసెన్స్'



చేస్తున్నారు!..." అంటూ కోప్పడ్డది.

వెంటనే నా వరసలోవున్న ఒకమ్మాయిలేచి నిబడి "మరే....మరే...మేష్టరమ్మగారండీ...మరే మరుండ్లా" ఆ పిల్లని మేమంతా "మరే" అని పిలుస్తుంటాం.

"ఇంక చాలు....కూర్చో...." అంటూ కోపంతో ఆ అమ్మాయిని కసిరింది మేష్టరమ్మ.

నే చెప్తానంటూ యింకో అమ్మాయి లేచింది.

"అసలే...మేష్టారమ్మగారండీ .... అసలే ... అసలుండ్లా...అసలామ్మాయికే...అసలూ...."

"అవు...నీ అసలూ పెసలూ...." కోపంతో అరిచింది మేష్టరమ్మ. క్లాసంతా ఒక్కసారి నిశ్శబ్దం అయిపోయింది.

కాళ్లకు వేసుకున్న 'హై హీల్స్' చెప్పులు టక్ టక్ మనిపించుకుంటూ పెద్ద రథంలావచ్చి మా ముందు నిలబడ్డది మేష్టరమ్మ. పిల్లలంతా బిగుసుకు పోయారు. నేను గుటకలు మింగడం మొదలెట్టాను.

"ఎందుకు భయపడ్డావ్!.. ఏం జరిగింది చెప్పు... !" అంటూ కోపంగావున్న మేష్టరమ్మ వా బెత్తంతో ముందున్న బల్లమీద గట్టిగా బాదింది.

ఆ దెబ్బకు చెంగున మేష్టరమ్మ మీదికిదూకింది... అంతవరకూ నేను బల్లి అనుకుని భయపడ్డ కప్ప.

మేష రమ్మ కెవ్వున కేకేసి భయంతోనూ, అసహ్యంతోనూ కేర్ బార్‌మంటూ గెంతడం మొదలెట్టింది. పిల్లలందరం నవ్వు బిగబట్టుకోలేక చచ్చాం. కప్ప మేష్టరమ్మను వదల్లా....ఒక్కసారి హై జంప్ చేసి తపక్కున మేష్టరమ్మ తల మీదికెళ్ళి చతికిల పడ్డది.

"అమ్మో" అంటూ మళ్లీ ఒక్క పొలికేక పెట్టి కంపరంతో ఎగరడం మొదలెట్టింది మాస్టరమ్మ.

ఆ ఎగరడంలో 'బేలెన్స్' తప్పి మేష్టరమ్మ తపక్కున కిందపడ్డది.


మేష్టరమ్మను కింద పడేసిన కప్ప ఒక్క గంతులో వెళ్లి మేష్టరమ్మ కుర్చీలో కూలబడ్డది. కిందబడ్డ మేష్టరమ్మ కాలుబెణికి లేవలేకపోయింది. క్లాసులోవున్న పిల్లలందరం కలిసి సాయంపట్టి లేవదీశాం. ఒకళ్లిద్దరు లేవదీసే శరీరంకాదు, మేష్టరమ్మది. నవ్వు ఆపుకోడానికి అవస్థపడుతున్న మా పిల్ల కోతుల ముఖాలుచూసి కప్పగంతులో అలసిపోయి, ముచ్చెమటలు పట్టిన మేష్టరమ్మ ఒక్కింత సిగ్గుపడ్డది. మరుక్షణం తన సీట్లో కూర్చున్న కప్పను చూసి త్రుళ్లిపడి "అబ్బెబ్బేబ్బే.....ఛాఛాఛా.... ఛూఛూఛూ చూస్తారేం! నాసీట్లోనించి తీసేయండా డర్టీ క్రీచర్ని!" అంటూ కంపరంతో ఒళ్లు విదిలించుకుంది. మేష్టరమ్మ కప్ప దగ్గర కెళ్లడానికి భయపడుతున్న పిల్లలంతా ఒకళ్ల ముఖాలు యింకోళ్ళు చూసుకుంటూ నిలబడ్డారు....

* * *

కప్పంటే భయంలేని నేను వెళ్లి మేష్టరమ్మ సీట్లో కూర్చున్న కప్పను పెన్సిల్‌తో బయటికి నెట్టేశాను.....మేష్టరమ్మ నన్ను చూసి ఆశ్చర్యంతో "నీకు కప్పంటే భయంలేదూ" అన్నది.... 'లే'దన్నాను.....

"మరెందుకు యిందాక భయపడి పక్కకు జరిగావు" అని అడిగింది....

"అదే .... అదీ .... మేష్టారమ్మగారండీ



అదుండ్లా ఆ మ్మా యి కీ .... అదే...."ఆ 'అది' చెప్పేలోగా నేనే చెప్పేశాను బల్లి అనుకుని భయపడ్డానని.....

"వాట్! నీకు బల్లినిచూస్తే భయమా!...." అన్నది మేష్టరమ్మ నన్ను చూసి ఎగతాళిగా నవ్వుతూ.....

"అవును మేష్టరమ్మగారూ. మీకు కప్పంటే ఎంత బయ్యిమో అంత బయ్యం ఆమ్మాయికి బల్లంటే...." అంది ఓ పిల్ల.

"నాన్సెన్స్....బల్లినిచూసి భయపట్టం ఏమిటీ మీనింగ్ లెస్....పాపం అది మోస్ట్ హారమ్లెస్ క్రీచర్. యింకా కప్పంటే భయపట్టంలో అర్థం వుంది. డర్టీ క్రీచర్...." అంటూ కుంటుతున్న మేష రమ్మవెళ్లి తనకు బదులు కాసేపు కుర్చీలో కూర్చున్న కప్ప వెళ్లిపోయిందో లేదోజాగ్రత్తగా పరిశీలించి మరీ కుర్చీ ఆక్రమించుకుంది. మళ్లీ పాఠం చెప్పడానికి మేష్టరమ్మ పుస్తకం తీసింది.... కాని దృష్టి పుస్తకంమీద నిలవలేదు.....తన చుట్టు ప్రక్కలేవుంది చూపంతా....మళ్లీ ఆ కప్ప ఎక్కడ ఎగిరొచ్చి మీదపడుతుందోనన్న భయంతో పాఠం ముందుకు సాగలేదు. ఏ చిన్న కాగితం కదిలినా మేష్టరమ్మ అదిరిపడి పుస్తకంకింద పడెయ్యడంచూసి నవ్వు ఆపుకోలేక సతమతమయ్యాం....యింక లాభం లేదని గ్రహించిన మేష్టరమ్మ ఆ పూట తన కాలు నొప్పి సాకుతో మమ్మల్ని యిండ్లకు పంపించేసింది.... బ్రతుకుజీవుడా అంటూ బయటబడ్డ పిల్లలందరం ఒక్కసారి గొల్లున పొట్ట చెక్కలయ్యేట్టు నవ్వాం....ఆ దెబ్బతో వారం రోజులు మా అందరికీ శలవిచ్చింది కప్ప....

యింట్లో యీ సంగతి విన్న నాన్న "ఛాఛా కప్పకు భయపడే టీచరు మీకేం చదువు చెప్తుంది. యింక నువ్వా స్కూలుకు వెళ్లనవసరంలా...." అని మర్నాడే నన్ను తీసికెళ్లి అన్నయ్య వాళ్ళు చదివిన ఎలిమెంటరీ స్కూల్లో చేర్పించాడు.

ఆడపిల్లలూ, మగపిల్లలూ కలిసి చదివే ఆ స్కూలు వాతావరణం అలవాటయ్యిందాకా అవస్థపడ్డాను....మేరుపర్వతంలాంటి మా మేష్టరమ్మను చూసివున్న నా కండ్లకు తిరగలి పిడిలాగా వున్న మా కొత్త మేష్టరు నలుసులా కనిపించాడు.

ఆస్కూల్లో చేరిన కొత్తల్లో ఒకరోజు మా క్లాసుకు హెడ్‌మాస్టరొచ్చాడు. ఏనుగు పక్కన ఎర్రచీమలాగా కనిపించాడు హెడ్‌మాస్టర్ పక్కన మా మాస్టరు....యిద్దరూ కొత్తగా చేరిన పిల్లల చదువు విషయం ఏదో మాట్లాడుతూ మా ముందు కొచ్చారు....

అంతకుముందు చాలాసేపట్నుంచీ నేనున్న వరసలో ఒక కుర్రాడు తన నిక్కరు జేబులోంచి బటానీలు తీసి తన చొక్కా జేబులో ఒక్కొక్కటీ వేస్తున్నాడు. అట్లా ఎందుకేస్తున్నాడో, దేనికేస్తున్నాడో మాకర్థం కాలేదు... యీలోపుగా హెడ్‌మాస్టరు దగ్గరికి రావడంచూసి ఆ కుర్రాడు బటానీలు వెయ్యడం ఆపి బిగుసుకుపోయి నిలబడ్డాడు. బటానీలు పడడం ఆగిపోయేసరికి ఆ కుర్రాడి చొక్కా జేబులో ఏదో కదలడం మాతోబాటు హెడ్‌మాస్టరు కంట కూడా పడ్డది....

"ఏమిట్రా అదీ!....నీ చొక్కా జేబులో ఏమిటి కదుల్తోంది!... వాటీస్ దట్!" అంటూ హెడ్ మాస్టర్ గర్జించాడు.

భయంతో ఆ కుర్రాడు ఒక్కసారి ఉలిక్కిపడ్డాడు. తక్షణం లాంగ్ జంప్‌చేసి చెంగున హెడ్ మాస్టర్‌మీదికి దూకింది, అంతవరకూ ఆ కుర్రాడి జేబులో బటానీలు తిన్న ఉడతపిల్ల...

హెడ్‌మాస్టర్ ఒక్క వెర్రికేకపెట్టి పక్కనున్న మా తిరగలిపిడిమాస్టర్ని అమాంతంగా వాటేసుకున్నాడు....

చూస్తుండగానే మా మాస్టరు కనిపించలేదు....

కొండంత హెడ్‌మాస్టర్ వేసుకున్న హెూల్డాల్లాంటి పెద్ద కోట్లో ఓమూల కదుల్తున్నాడు మా మాస్టరు....ఆ కుర్రాడి జేబులో ఉడతపిల్ల కదిలినట్లు..... అంతవరకూ హెడ్‌మాస్టర్ ఒంటి మీద చెడా మడా ఎగిరి గంతు లేసిన ఉడతపిల్ల టింగురంగా అంటూ హెడ్‌మాస్టర్ బట్టతలమీది కెగిరి కూర్చుని బటాణీలకోసం గీకడం మొదలెట్టింది....

యింక పిచ్చెత్తినట్టు కేకలు పెడుతూ, మా మాస్టర్ని పట్టుకుని కుప్పిగంతులెయ్యడం మొదలెట్టారు హెడ్‌మాస్టర్.....

ఆ గంతుల్లో కూరగాయలుతెచ్చే సంచుల్లాగా



వున్న హెడ్‌మాస్టర్ కోటు జేబుల్లో ఏ జేబు లోనో మా మాస్టర్ తల స్టకప్పయింది....

వూపిరాడక కీక్....కీక్...అంటం మొదలెట్టాడు మా మాస్టరు .... నెత్తిమీద గంగలాగా కూర్చున్న ఉడత పిల్లతో వెర్రులెత్తి శివతాండతం చేస్తున్న హెడ్‌మాస్టర్ మా మాస్ట రవస్థ గమనించే స్థితిలో లేడు.

ఏం చేయాలో తెలీక అంతవరకూ గుడ్లప్పజెప్పి మాస్టర్ల దురవస్థ చూస్తూ నిలబడ్డ మా క్లాసు పిల్లల్లో ఎవరో ఒకపిల్లాడు ధైర్యంచేసిముందుకొచ్చి హెడ్‌మాస్టరుతల గోకుతూ కూర్చున్న ఉడత పిల్లనుపట్టి తీసేశాడు....ఆ చేత్తోనే మా మాస్టర్ని కూడా హెడ్‌మాస్టర్ హెూల్డాల్ కోటు జేబు లోంచి బయటికి లాగేశాడు....


ఆయాసపడుతూ బీభత్సంగా చెమటలు కక్కు తున్న హెడ్‌మాస్టర్ ఒకసారి క్లాసంతా కలయ చూశాడు. పక్కకు తిరిగి నవ్వు ఆపుకోడానికి ప్రయత్నిస్తున్న పిల్లలందర్నీచూసి అవమానం తోనూ, కోపంతోనూ "ఫూల్స్. యిడియట్స్ స్టుపిడ్స్...బుద్ధివుండక్కర్లా ఉడతల్ని తెస్తారా క్లాస్‌కు! ...... ఇకమీద ఎవరైనా ఉడతల్నితెస్తే డిస్మిస్" అని మండిపడుతూ వెళ్లిపోయాడు హెడ్ మాస్టర్....

"చిత్రం చిత్రం...." అంటూ నీరసంగా వాకిలిదాకా నడిచాడు హెడ్‌మాస్టర్ జేబులో నగం చచ్చిపోయిన మా మేష్టరు....

తర్వాత మా మేష్టరే చెప్పాడు. హెడ్‌మాస్టరుకు ఉడతంటే చచ్చేంతభయం అనీ, స్కూల్లో ఉడత లెక్కువగా వున్నాయనే భయంతో ఉడతల్నిబట్టే వాళ్ళను పిలిపించి తన రూముచుట్టూ అంగరక్షకు ల్లాగా వుంచాడనీ చెప్పాడు.....యింక హెడ్ మాష్టర్ని కట్టేశారు మా క్లాసు పిల్లలు....హెడ్ మాస్టరు పోతుంటే దూరాన్నుంచే "ఉడతా ఉడతా ఊచ్ సన్నబియ్యం సొచ్"అంటూ గోలచేసేవాళ్ళు... నాకు నవ్వొచ్చింది హెడ్‌మాస్టర్ అవస్థకు....కాని హెడ్‌మాస్టర్ నాకంటే ఒక విధంగా అదృష్ట వంతుడు..... ఉడతలు యింట్లో మకాం పెట్టవు... వాటిలాగే యీ బల్లులు కూడా ఏ అరణ్యాల్లోనో వుండకుండా మనుషుల్తోబాటు యిండ్లలోవుంటూ అన్ని గదుల్లోనూ నిర్భయంగా తిరగడమే నా ప్రాణానికి సంకటంగా తయారయింది....

నేను పగలంతా బల్లుల్ని వేటాడితే, బల్లులు రాత్రుళ్ళు కల్లో నన్ను వేటాడేవి..

కల్లో కనుపించే బల్లులు మామూలు బల్లులు కావు....మనిషి సైజు బల్లులు. నన్ను కొరకొరా చూసేవి...ఏమిటో మాట్లాడుతూ తిట్టేవి నన్ను... ఎగతాళిగా నవ్వుతూ వెక్కిరించేవి....చివరకు కోపంతో నామీద దూకడానికి ప్రయత్నించినప్పుడు కెవ్వు మని అరిచేదాన్ని.....నా కేకలకు యింటిల్లిపాదీ నిద్ర లేవడమే గాకుండా యిరుగు పొరుగు వాండ్లు



కూడా లేచి లైట్లేసుకుని పరుగెత్తుకొచ్చేవాళ్ళు మా యింట్లో దొంగలు పడ్డారేమోని....

అసలు సంగతి అమ్మా నాన్నా వాళ్ళు చెప్పగానే "భలే పిల్లే" అని నవ్వుకుంటూ వెళ్లిపోయేవాళ్ళు.

యింక ఆ రాత్రి నాకు నిద్రపట్టేదికాదు— కన్ను మూస్తే దూకుతామంటూ కాచుకోనుండేవి నా కల్లో బల్లులు....

"నిద్ర పోకుండా ఏమిటీ అవస్థ....పోనీ బల్లిని తీసుకొచ్చి ఒకసారి దాని నెత్తిన పడేస్తే భయం పోతుందేమో" అనేవాడు విసుగెత్తిన నాన్న.... "అయ్యయ్యో యింకేమైనా వుందా! భయంతో గుండె ఆగిపోదూ!....అదేపోతుంది పెద్దయ్యేకొద్దీ" అనేది అమ్మ....

అమ్మ చెప్పినట్టు పెద్దయ్యాను. పెళ్ళయింది. పిల్లవాడు కూడా పుట్టాడు....కాని నా బల్లి భయం మాత్రం పోలేదు....

ఒకరోజు మామూలుగా పూజకు కూర్చున్నాను. ఎప్పుడు చేరిందో నా కెదురుగావున్న గోడమీద బల్లి.....గుండె జల్లుమంది. అది పూజగది. లోప లికి పనివాళ్ళు రాకూడదని మా అత్తగారి శాసనం ఏం చేసేది!.....ఆపూట పూజ 'సింపుల్'గా చేసి మా అత్తగారు ఆరగింపు తెచ్చేలోగానే బయట బడ్డాను.

"ఏమిటే యీ పూట అంత తొందరగా ముగిం చావు పూజ! షూటింగ్ ఏమైనా వుందా" అని అడి గారు మా అత్తగారు.

"అబ్బేలేదు....రేపు శుక్రవారం ఎటూ చాలా సేపు చేయాలిగా పూజ! యీ పూట మిగతా పన్లు చూద్దామని..." అంటూ తప్పుకున్నాను..... మర్నాడు ప్రొద్దుటే పూజగదికొచ్చి ఒకసారి నాలుగు వైపులా పరకాయించి చూశాను. బల్లి కనిపించ లేదు....పోయింది. అబ్బ ప్రాణం కుదటపడ్డది... అయినా పూజ గదిలో ఎలుకలు తిరగడం చూశాను గాని బల్లిని ఎప్పుడూ చూళ్లేదు. బల్లి కనిపించక్క పోయేసరికి నిర్భయంగా పూజకు సన్నాహాలు చేసు కుని కూర్చున్నాను....మా అత్తగారు కూడా నాకు కొంచం దగ్గర్లో తలుపు కానుకుని కూర్చున్నారు.

గణపతికో టెంకాయకొట్టి, అమ్మవారికి కూడా

అరగింపుపెట్టి కుంకుమార్చనకు కూర్చున్నాను.

'ఓం శ్రీమాత్రే నమః ఓం శ్రీ మహారాజ్ఞై నమః, ఓం శ్రీమత్సింహాసనేశ్వర్యై నమః. ఓం చిదగ్ని 'కుండ సంభూతా....భూ...తా' నా ముందున్న మీనాక్షి అమ్మవారికి ముద్దుగా కట్టిన పట్టుపావడా లోంచి తొంగిచూసింది బల్లి.....పై ప్రాణం పైన్నేపోయింది.

పీటతోసహా ఎక్స్‌ప్రెస్ స్పీడ్‌లో జర్రున వెనక్కి జరిగివెళ్లి మా అత్తగారిమీద పడ్డాను....."ఓయమ్మ ఏమిటే.... ఏమైందే..." అంటూ ఖంగారుపడుతూ మా అత్తగారు భయంతో వణుకుతున్న నా భుజాలుపట్టి కుదిపారు. యింక చెప్పక తప్పలేదు... అమ్మవారి పావడమీదున్న బల్లిని చూపించాను.

ఓసి నీయింట వాన గురవా. బల్లిని చూశా యింతవేటు భయపడ్డావ్" అంటూ పడీ పడీ నవ్వారు మా అత్తగారు...

ఈ లోపుగా ఆఫీసుకు బయల్దేరిన మావారు దేవుడికి నమస్కరించుకోడానికొచ్చారు.

"ఏం బల్లేనా! హతోస్మి...యిక్కడా చేరాయా! చేరకేంజేస్తాయ్! యీ పూజగదిలో ఒక్క మగదేవుడు కూడా లేకపోయే...అంతా ఆడ గేంగుతోనే నిండి పోయింది. అందుకే మగదేవుళ్లకు కోపంవచ్చి బల్లుల్ని ఒదిలారు... ఆడవాళ్లు కూడా దేవుళ్లే! ఆడవాళ్లే దేవుళ్లైతే బల్లులెందుకు వస్తాయి" అంటూ పాడి.

"ఓ వెంకటేశ్వరా శంభో శంకరా బల్లులు రాకుండా చేసే శక్తి మీ భార్యల దగ్గర లేదని తేలిపోయింది. మీరైనా యీ బల్లుల్ని యికమీద యీ గదికి రాకుండా చూస్తేనే మీ భార్యలకు ఎప్పుడైనా ఓ టెంకాయ చిప్ప దొరుకుతుంది...లేదంటే పూజా గది బంద్" అని మా వారు నన్ను కాసేపు ఏడిపించి అమ్మవారి పావడామీదున్న బల్లిని బయటికి తరిమేసి, "యింక నీ పూజ స్తిమితంగా కానీ...." అంటూ ఆఫీసు కెళ్లిపోయారు.

"ఓసి నీ భయం బంగారంగానూ....ఎంత భయమే...." అంటూ మళ్లీ ముందుకుపడి నవ్వారు మా అత్తగారు...ఏ మూలనుంచో 'మ్యావ్' మని సన్నగా వినిపించింది....

'సడన్' గా మా అత్తగారి నవ్వు ఆగిపోయింది. ... ఉన్నట్టుండి మా అత్తగారి ముఖం ఎందు కల్లా సీరియస్‌గా మారిపోయిందో నా కర్థం కాలేదు. . . మళ్లీ పూజకు కూర్చున్నాను.

కిచకిచమంటూ అటకమీద శబ్దం వినిపించింది .... మరుక్షణం రెండు ఎలుకలు క్రిందికి దూకాయి. వాటి వెనకాలే మా అత్తగారి ముందుకు దూకింది వో గిండుపిల్లి ..

"వోయమ్మ చచ్చానేవ్ ! .... " అంటూ ఒక్క వెర్రికేక పెట్టి అమాంతంగా వచ్చి నామీద పడ్డది భయంతో కండ్లు గట్టిగా మూసుకున్న మా అత్తగారు .... మా అత్తగారికి పిల్లి అంటే అంత భయమని నా కంతవరకూ తెలీదు ...... నవ్వాపుకోడానికి అవస్థ పడ్డాను .... పిల్లి వెళ్లి పోయి అరగంటయినా మా అత్తగారు ఆ భయంతో నన్ను వదల్లా .... అందుకే కాబోలు వంటింట్లో ఆవిడ చుట్టూ ఎలకబోన్లుండేవి. ప్రతిరోజూ గది కొక ఎలకబోను పెడుతుండేది ...

ఆరోజు నా పూజకు అన్నీ విఘ్నాలే .... నేను బల్లిని చూసినరోజు ఏదో ఒక హడావిడి జరిగి



చేస్తున్న పనికి 'బ్రేక్' పడేది.

ఒకసారి రికార్డింగ్ జరుగుతోంది. మైక్ ముందు కూర్చుని పాడుతున్నాను. ఎప్పుడొచ్చిందో, ఎట్లా వచ్చిందో నా ముందున్న మైక్ వెనక నుంచి తొంగిచూసింది, బల్లి .... గుండె ఝల్లు మంది. పాడుతున్న నా గొంతు భయంతో బిగుసుకుపోయి 'కీక్‌కీక్' అంటం విన్న సౌండ్ యింజనీర్ 'కట్‌కట్' అంటూ గోలెత్తేడు. బలం అంతా కూడగట్టుకుని ప్రాణం అరచేతిలో పెట్టుకుని ఒక్క దూకులో ఆ కుర్చీలోంచి బయటపడ్డాను. నాతోబాటే బల్లి కూడా అవతలికి దూకి వెళ్లిపోయింది .....

"ఎన్నమ్మా ఎన్న ఆచ్చి!".... అంటూ ఖంగారు పడుతూ వచ్చిన సౌండ్ యింజనీర్‌కు ఏం చెప్పాలో తెలీక అలాంటి సందర్భాల్లో నా మామూలు 'ఆముదం నవ్వు' తో 'ఒణ్ణుమిల్లై' 'ఒణ్ణుమిల్లై' అన్నాను.

"ఏమిటి ! బల్లేనా !" అంటూ వచ్చారు మా వారు కూడా. చచ్చాను. ఈ లో గా ఏమిటేమిటంటూ ఆర్కెస్ట్రావాళ్లంతా కూడా చుట్టూ చేరారు.

చెప్పొద్దని కండ్లతో బ్రతిమాలుకున్నాను మావార్ని. అబ్బే .... ధర్మరాజును చంపి పుట్టారు మావారు. అబద్ధం చెప్పరు. ధర్మరాజైనా సంస్కృతంలో సగం చెప్పాడు. కాని మావారు అచ్చ తెలుగులో నా భయం సంగతి పూర్తి నిజం చెప్పారు. అంతా ఒక్కసారి గొల్లున నవ్వారు. నా ప్రాణం చచ్చిపోయింది.

"అడెడే .... ! పల్లి అన్నా యివ్వళవు భయమా ! అదెన్నపణ్ణుం అమ్మా ! 'మోస్ట్ హారమ్‌లెస్ క్రీచర్ ...." అని మా సౌండ్ యింజనీరు తేలిగ్గా నవ్వుతూ మైక్ దగ్గరికెళ్లి కర్చీఫ్‌తో మైక్ మీద మన్ను దులిపాడు. తక్షణం జటాయువు లాంటి రెక్కలతో 'ఏరోప్లేన్' లాగా ఎగిరి సౌండ్ యింజనీరు రెండెకరాల నుదురుమీద 'సేఫ్' గా 'లేండ్' అయింది వో బొద్దెంక.

కెవ్వున కేకేసి భయంతోనూ, అసహ్యంతోనూ మెలికలు తిరిగి వెల్లెకిలా పడ్డాడు సౌండ్ యింజనీరు.

'కెకెకెకె .... తెతెతెతె .... అడి .... పుడి ....కడి' యిత్యాది సంధిమాటలతో కాళ్లు చేతులు తపతప కొట్టుకుంటున్న సౌండ్ యింజనీరు అవస్థ ఏమిటో తెలీక స్టన్నయి చూస్తూ వుండి పోయాం.

చటుక్కున మావారు తన చేతులో ఉన్న కర్చీఫ్‌తో సౌండ్ యింజనీరు నుదురు ఎద్దులా దున్నుతున్న బొద్దెంకను తరిమేశారు. అప్పుడు నా కర్థమైంది. ఆ బొద్దెంకను మైక్‌మీదే చూసే బల్లి పరుగెత్తుకొచ్చి ఉంటుంది. ఒళ్లు జలదరించింది. చెమటలు కారుతున్న సౌండ్ యింజనీర్ని చూసి నవ్వు ఆపుకోలేక ఆర్కెస్ట్రా వాళ్లంతా రికార్డింగ్ రూము బయటికి పరుగెత్తారు. తర్వాత తెలిసింది. సౌండ్ యింజనీరుకు బొద్దెంకంటే చచ్చేంత భయం అనీ, దాన్ని తమిళంలో "కరుప్పాంబూచి" అంటారనీ, దానిపేరు చెబితేనే అదిరిపడతాడనీ, అందుకే ఆ సౌండ్ యింజనీర్ని అంతా "కరుప్పాంబూచి" అంటూ చాటుగా గోల చేస్తుంటారనీ . . . . . పాపం, అతన్ని చూసి నాకు జాలివేసింది. అలాంటి వాళ్ల అవస్థ నే నొక్కదాన్నే అర్థం చేసుకోగలనేమో అనిపించింది.

ఒకసారి ఎవరిదో పిక్చెరు షూటింగుకు వెళ్లాను.

అది ఒక బ్రహ్మాండమైన అరణ్యం సెట్టు. ఒట్టి అరణ్యం మాత్రమే కాదు. వో పాడుబడ్డ దేవాలయ మంటపం దాని చుట్టూ అరణ్యం. ఆ సెట్టు నేను పనిచేసే ఆ పిక్చెరుకోసం వేసింది కాదు. అయినా ఆ సెట్టు ఆ సంవత్సరం ప్రొడ్యూసర్ల పాలిటి కామధేనువూ, కల్పవృక్షమూ అయి కూర్చుంది. ఆ సెట్లో షూట్ చేయని ప్రొడ్యూసర్ లేడు. ఆ సంవత్సరం తయారయిన అన్ని పిక్చర్లలోనూ, అరణ్యరోదన ఘట్టాలన్నీ అక్కడే తీశారు. ఒకవేళ ఎవరి పిక్చెర్లోనైనా అరణ్యం సీను లేకపోతే కొత్తగా కల్పించి సీన్సు వ్రాయించి మరీ షూట్ చేశారా అరణ్యంలో. యిండస్ట్రీలో ఉన్న ఆర్టిస్టులంతా ఆ అరణ్యంలో ఏ కొమ్మో పట్టుకుని కాసేపు ఏడ్చి వెళ్లారు.

ధర్మరాజును యక్షుడు ప్రశ్నలడిగింది

ఆ అరణ్యంలోనే—రాముడు సీతకోసం వాపోయింది ఆ దండకారణ్యంలోనే. వ్యాసులు భారతం వ్రాసిందీ ఋషులు తపస్సు చేసిందీ కూడా ఆ నైమిశారణ్యంలోనే. అదే కథానాయకి కష్టాలకు కాకులు దూరని కారడవి. అదే దార్లుకొట్టే దొంగలకు చీమలు దూరని చిట్టడవి అయింది. ఆ అరణ్యమే స్టూడియోలో లేకుండా ఎక్కడైనా బయ టున్నట్లయితే దలైలామా కూడా ఆ అరణ్యంలోంచే వచ్చేవాడు ఇండియాకు.

ఆ అరణ్యం యింకా కొంతకాలం ఆ స్టూడియోలో ఉంటే దాని ప్రతిభ స్థలపురాణంలో కెక్కేదే. కాని పాములు, తేళ్ళు, ఎలకలు, పంది కొక్కులు యిత్యాది స్టుడియో అడివిమృగాలు చేరుస్తున్నాయనీ, యింక కొన్నాళ్ళు ఉంచితే పులులూ, సింహాలూ కూడా చేరవచ్చని భయపడ్డ ఆ స్టుడియో యజమాని ఒక సంవత్సరంగా ఉన్న ఆ అరణ్యానికి పుట్టినరోజు పండగ చేసి ఆ సెట్టు పీకేయించాడు

అది తీసేసేముందు ఆ చరిత్ర ప్రసిద్ధిగాంచిన అరణ్యానికి నేనూ వెళ్లాను—కాస్సేపు ఏడ్చి రావడా[నికి]. [ఆ]రోజు [నా]తోబాటు నా ఇష్టసఖి పాత్రధారి [మ]రో అమ్మాయి కూడా ఉంది. ఒక సం[వత్స]రంగా పాతుకుపోయిన ఆ అరణ్యం చిన్న చి[న్న జీ]వరాసుల్తో సజీవంగా కనిపించింది.

[పా]డుబడ్డ దేవాలయమంటపంలో మొదటి షాటుకు ఏర్పాటు చేశారు. 'రెడీ .... సైలెన్స్' అంటూ అరిచాడు డైరెక్టర్.

'షాట్' కోసం నా ఇష్టసఖి మేకప్ సరిజేసుకుంటుంటే మామూలు ప్రకారం నా కండ్లు మంటపం స్తంభాలమీది కెళ్లాయి ఏదో పురుక్కోసం చరచర వస్తోంది నేనున్న వైపుకే పెద్ద బల్లి. ప్రాణం ఎగిరిపోయింది. 'యాక్షన్' అంటూ అరిచాడు డైరెక్టరు. యాక్షన్ లేదూ, పాడూ లేదు, ఒక్కదూకులో వచ్చి అరణ్యంలో పడ్డాను.

''కట్ కట్ కట్ ఏమిటమ్మా ఏమైంది'' అంటూ పరుగెత్తుకొచ్చాడు డైరెక్టర్. ఇంతలో ఎవరో ''పాము ఏమో'' అన్నారు. అంతా 'పాము పాము ఎక్కడ, ఎక్కడ వెదకండి'' అంటూ మంటపములోకి పరుగెత్తారు డైరెక్టర్‌తో సహా.

''ఏమమ్మా, పామును చూశారా ! ఏవైపు వెళ్లింది'' అంటూ నా ఇష్టసఖి వణుకుతున్న నన్ను చూసి ఆతృతగా అడిగింది.

అటూ, యిటూ చూసి మెల్లిగా ''పాము కాదు బల్లి ...'' అన్నాను

ఒక్కసారి గొల్లుమని నవ్వింది నా ఇష్టసఖి.

ఆ అమ్మాయి నవ్వు విని పాముకోసం వెతికే వాళ్లంతా పరుగెత్తుకు వచ్చారు.

''ఆమెకు బల్లిని చూస్తే భయంలాగుందండీ. అందుకే అట్లా పరుగెత్తుకొచ్చారు'' అంటూ మ[ళ్ళీ విర]గబడి నవ్వింది. అందరూ ఆ అమ్మాయితో [శ్రు]తి కలిపారు నా [ఒ]ళ్లు మండింది. ఎవరి భయం వాళ్లది [ఎ]వ్వ[ర]కెం తెలుసు !

మూతి ముడుచుకున్న నన్ను చూసి డైరెక్టర్ ''అబ్బే అదేం చేస్తుందమ్మా. మోస్ట్ హారమ్‌లెస్ క్రీచర్ .... ఉండండి. దాన్ని అక్కణ్ణుంచి తరిమేయిస్తాను'' అంటూ అందరూ ఆ బల్లి వెనకాల [ప]డి దాన్ని అరణ్యంలోకి తరిమారు.

[illegible]

# పెద్ద ఆకారాలూ చిన్న వికారాలూ

యింకా భయపడుతూనే మంటపం దగ్గరికెళ్లాను.

''ఫర్వాలేదు రండి, బల్లి వెళ్లిపోయింది. నేనున్నానుగా, భయంలేదు రండి'' అంటూ నా ఇష్టసఖి నా చేయి పట్టుకుని మంటపం దగ్గరికి లాక్కెళ్లింది. అంతవరకూ నా దగ్గర మాట్లాట్టానికి భయపడ్డ ఆ అమ్మాయికి బల్లి భయంతో నేను ఒక్కసారిగా లోకువైపోయాను. ఛీ ఛీ యీ బల్లి నా పరువు తీస్తోంది అనుకుని మనసులో బాధ పడ్డాను.

''ఎస్, రెడీ .... స్టార్ట్'' అంటూ కేకేశాడు డైరెక్టర్. చుట్టూ నోసారి కలియచూసి కుదుట పడ్డ మనసుతో 'యాక్షన్' ఏమిటో అప్పుడాలో చించడం మొదలెట్టాను.

నా ఇష్టసఖి కష్టాల్లో ఉన్న నాకు (కథానాయిక) ధైర్యం చెప్పే షాటు అది.

''యాక్షన్'' అరిచాడు డైరెక్టర్. విచారంగా కూర్చున్నాను. నా ఇష్టసఖి డైలాగ్ మొదలెట్టింది.

''అమ్మా అధైర్యపడకండి .... మీకు అండగా నేను ...'' యింకా డైలాగ్ పూర్తికాలేదు. ఉన్నట్లుండి ఏవైపునుండి దూకిందో బ్రహ్మాండమైన పోతులాంటి తొండ .... ఒక్క దూకు దూకి నా ఇష్టసఖి జడ పట్టుకుంది గట్టిగా

''బాబోయ్'' అని ఒక్క గావుకేక పెట్టి భయంతో నన్నొచ్చి కావలించుకో బోయింది నా ఇష్టసఖి. బల్లి గాభరాలో వున్న నేను తుళ్లిపడి వెనక్కు జరిగాను. అంతా 'కట్ కట్ కట్' అని కోరస్ పాడుకుంటూ మా దగ్గరికి పరుగెత్తుకొచ్చారు.

భయంతోనూ, అసహ్యంతోనూ చెమటలు కక్కుతున్న నా ఇష్టసఖి రెండు చేతులూ బార

[illegible]



ఎవరు పట్టుకున్నా నిలవకుండా ఎగరడ లెట్టింది.

''అరెరె ! తొండ పట్టుకుంటె ఏడువాళ్ల గాడిదలు ఒక్కసారి అరవాలంటారే ! యిప్పుడెట్లా ! 'చుట్టుపక్క లెక్కడైనా ఉన్నాయా' గాడిదలు ? .... '' అన్నాడు హడావిడి పడుతున్న అసిస్టెంట్ డైరెక్టర్ అవతారం.

''ఆ .... ఉన్నాంగా ! మనం అంతా ఒక్కసారి అరిస్తే సరి'' అన్నాడు షూటింగ్ జరుగలేదని ఒళ్లు మంటగా ఉన్న డైరెక్టర్ విరాకు పడుతూ.

''లేదు సార్ .. యిది నే ననటం కాదు. పెద్ద వాళ్లన్నదే .... '' అంటూ సమర్థించుకున్నాడు అవతారం. ముచ్చెమటలు పోసి మూర్ఛపోవడానికి సిద్ధంగా ఉన్న నా ఇష్టసఖి జడ తొండ విడిచి పెట్టలేదు యింకోవైపు కూతురు అవస్థకు ఏడుపులూ, పెడబొబ్బలూ పెడుతూ ఎగురుతోంది నా యిష్టసఖి తల్లి .... జడను పైకెత్తి పట్టుకున్న డైరెక్టరు జడ నొకసారి గట్టిగా విదిలించాడు .. తొండ వదల్లా. క్రరతో అదిలించారు. కదల్లా.

''నేను చెప్పలేదా సార్ ! లాభంలేదు. జడ కత్తిరించాల్సిందే'' అన్నాడు ఆతివాగుడు అవతారం.

''నీ మొఖం యీడ్చ .... ఎంతమాటన్నావ్ ! ... నీ జుట్టే కత్తిరించుకో, నీ తలే బోడి కొట్టించుకో'' అంటూ అవతారంమీద విరుచుకు పడ్డది నా ఇష్టసఖి తల్లి. తక్షణం వెనక్కు తగ్గి గుంపులో కలిసిపోయాడు అవతారం

ఆవిడ గొడవకు నాకు నవ్వుతోపాటు చటుక్కున స్ఫురణ కొచ్చింది.

''ఆ అమ్మాయి జడమీద పూలకు బదులుగా పెట్టుకున్న సీతాకోక చిలకను తీసిపారేయండి'' అన్నాను. వెంటనే ఆ అమ్మాయి జడమీదున్న ప్లాస్టిక్ సీతాకోకచిలుకను పిన్నుతో సహా లాగి అవతల పారేశాడు డైరెక్టర్. తక్షణం ఆ చిలకతో పాటే జడ వదలిపెట్టి కిందికి దూకింది తొండ.

''అరె !'' అంటూ అందరూ ఆశ్చర్యంగా నావైపు చూశారు.

(64 వ పేజీ చూడండి)



"అబ్బే, ఇప్పుడు పనిలో వున్నాను. తర్వాత కలుసుకుందాం..."

చిత్రకారుడు: యిమంది నరసింహారావు (గాకినాడ)

## ప్రేమ అంటే....

తెలుగు విద్యార్థి: విమలా! ప్రేమ మాలా! కరుణించవేల?

సైన్సు విద్యార్థి: (పేరు విమల) ఏమిటీ కాకిగోల?

తె. వి.—కాకిగోల కాదు, ప్రేమగోల!

విమల—ప్రేమఅంటే ?...

తె. వి.- ప్రేమా? ప్రేమే. అంటే 'లవ్'. మహబ్బత్ ...

విమల-ఆపు. ప్రేమ పర్యాయ పదాలు కాదు నేను అడిగినది. దాని భౌతిక రసాయనిక ధర్మాలు ఏమి?

తె. వి.-ప్రేమకు రూపం లేదు. అందుకే భౌతిక ధర్మాల ప్రసక్తిలేదు, ఉండదు. అది మదిరం కన్న అధికంగా మత్తు కలుగజేసేది; మధువు కన్న మధురం.

విమల-అయితే మధువు కలిపిన మదిరం త్రాగు.

—సి. వి. రమణ (మదనపల్లి)

## పొట్టి కథలు

'ఒకడికి అంగుడిలేదు, ఒకడికి మింగుడులేదు'

రైలుబండిలో ప్రయాణం చేస్తున్న ఆసామీ బండి ఒక స్టేషన్‌లో ఆగితే ఒక జేబులోంచి ఒకగడియారం, తరువాత రెండో జేబులోంచి మరో గడియారం తీసి చూచాడు. అతడు ప్రతిస్టేషన్‌లోను అదేవిధంగా వరుసగా రెండు గడియారాలు తీసి చూడడం సాగించాడు.

తోడి ప్రయాణీకుడు ఉండబట్టలేక "ఏమండి, మీరేమైనా పరిశోధన చేస్తున్నారా? అలా రెండు గడియారాలు వరసగా చూస్తున్నారు" అని ప్రశ్నించాడు.

గడియారాల మనిషి అన్నడిట. "లేదండి. ఒక గడియారానికి నిమిషాలముల్లు లేదు. రెండోదానికి గంటలముల్లు లేదు. అందుచేత టైమ్ తెలుసుకోడానికి..."

కె. నారాయణరెడ్డి, (ఇంగుర్తి)

## పెద్ద ఆకారాలూ చిన్న వికారాలూ

(12-పేజీ తరువాయి)

అరిచి, ఏడ్చి అలసిపోయిన నా ఇష్టసఖి నన్నొచ్చి గట్టిగా కావలించుకొంది. వాళ్లమ్మ కూడా నా దగ్గరికొచ్చి "నా బిడ్డను కాపాడావు తల్లీ... దానికి చిన్నప్పట్నుంచీ తొండను చూస్తే చచ్చేంత భయం. ఇంకాసేపుంటే భయంతో చచ్చేపోతుం దనుకున్నాను. నా బిడ్డను నాకు దక్కించావు. నీ మేలు మర్చిపోను" అంటూ నా చేతులు రెండూ కండ్ల కద్దుకుంది.

"అసలు మీ రెలా కనుక్కున్నారు! ఆ సీతాకోక చిలక్కోసం తొండ వచ్చిందనీ" అంటూ అందరూ నా చుట్టూ చేరారు—

"ఆమెది 'జీనియస్ బ్రెయిన్స్' అయ్యా" అన్నాడు డైరెక్టరు నన్ను అభినందిస్తూ.

"అసలది కాదండీ.." అంటూ మళ్లీ ముందు కొచ్చాడు అవతారం.

"విన్నారుగా! డైరెక్టరుగారు చెప్పింది! ఫూ" అన్నాను సీరియస్‌గా ముఖంపెట్టి. అంతా ఒక్కసారి గొల్లున నవ్వారు నా 'విట్టు' కు.

నా ఇష్టసఖి రెస్టు కోరడంవల్ల నా సలహామీద ఆరోజు షూటింగ్ కేన్సల్ చేశారు. ఇంటికి వెళ్లడానికి కార్లో బయలుదేరుతున్న నా దగ్గరికి నా ఇష్టసఖి పరుగెత్తుకొచ్చింది.

"క్షమించండి. బల్లి భయంతో పరుగెత్తిన మిమ్మల్ని చూసి నవ్వినందుకు వెంటనే తగిన శాస్తి చేశాడు దేవుడు. భయంతో చచ్చిపోవాల్సిన నన్ను మీరే బ్రతికించా రీ రోజు" అంటూ ఎంతో కృతజ్ఞతతో నమస్కరించి వెళ్లిపోయింది నా ఇష్టసఖి.

బల్లి అంటే భయంతో గజగజలాడే నేను తొండంటే భయపడే మరొక ప్రాణిని రక్షించగలిగానా! నాలో నేనే నవ్వుకున్నాను. ★

Printed and Published for NageswaraRao Estates (Private) Ltd., by S. Radha Krishna at The Andhra Patrika Press 6 & 7, Thambu Chetty Street, Madras-1. Editor S. Sambhu Prasad